క్లుప్తంగా

ఘనంగా షోడశ గౌరీ వ్రత పూజలు

బైరెడ్డిపల్లె: మండలంలో శుక్రవారం షోడశ గౌరీ వ్రత పూజలను వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మహిళలు ఇళ్లల్లో పసుపుతో షోడశ గౌరీ దేవిని తయారు చేసి ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై కొలువుదీర్చారు. సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

అయ్యప్ప స్వామికి భజనలు



ప్రత్యేక అలంకరణలో శ్రీఅయ్యప్పస్వామి

పుంగనూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి భక్తులు శుక్రవారం ప్రత్యేక భజనలు చేపట్టారు. 41 రోజుల పాటు నల్ల వస్త్రాలు ధరించి, కఠోరదీక్షతో సంసార జీవితాలకు దూరంగా అయ్యప్పసేవలో కొనసాగుతారు. పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీ, నగరివీధి, కోనేటి వద్ద ఉన్న శివాలయంలో అయ్యప్పస్వామి భక్తులు అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అయ్యప్ప స్వామి కీర్తనలతో పట్టణం భక్తి పారవశ్యమైంది. ఈ నెల 13న కేరళలో జరిగే ఓనం పండుగ రోజున అయ్యప్ప ఆలయాన్ని తెరుస్తారు. ఆరోజు వెళ్లేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి భక్తవత్సలం, అయ్యప్ప స్వామి భక్తులు శరణ్, రవి, వాసు, భరత్, దేవ, భగత్‌సింగ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

తాత్కాలిక విద్యుత్ సర్వీసులు పొందాలి

పలమనేరు: ట్రాన్స్‌కో పరిధిలో వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు తప్పకుండా తాత్కాలిక కరెంట్ కనెక్షన్ పొందాలని స్థానిక ఏడీ చిన్నబ్బ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 250 వాట్స్‌కు రూ.500, 500 వాట్స్‌దాకా రూ.1000, ఆపైన రూ.1500 దాకా చెల్లించి రసీదు పొందాలని సూచించారు. దీంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరక్కుండా తమ సిబ్బంది నిఘా ఉంటారన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు నగరంలోని మురకంబట్టు వరసిద్ధి వినాయక ఆలయ నూతన కల్యాణ మండపం వద్ద 14 రోజులు ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు సిద్ధ సమాధి యోగాచార్యులు నరేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలు, ఆహారపు అలవాట్లు, పంచకోశ శుద్ధి నేర్పిస్తామని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు పైబడిన వారు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8247609140లో సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఆయన శుక్రవారం ఆ సంఘం నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యకలాపాలకు స్థలం కేటాయించాలని కోరారు. వివిధ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కచ్చితంగా అంబేడ్కర్ ఫొటోను పెట్టేలా ఉత్తర్వులు జారీచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సులోచన, జిల్లా అధ్యక్షుడు మురళి, కార్యదర్శి మహేందర్, కుమారి పాల్గొన్నారు.

వీధులు కిటకిట



జనంతో కిటకిటలాడుతోన్న గంగమ్మతోపు వీధి

- పూజా సామగ్రి కొనుగోళ్లతో దుకాణాల్లో సందడి
- అమాంతం పెరిగిన పూజ సామగ్రి ధరలు
- అయినా కొనుగోళ్లపై ఆసక్తి చూపిన జనం
- పలమనేరు డివిజన్‌లో కోట్లలో పండుగ వ్యాపారం

పలమనేరు: నేటి చవితి సంబరాలను ఘనంగా చేసుకొనేందుకు పలమనేరు రెవెన్యూ డివిజన్ ప్రజలు సిద్ధమవుతున్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పూజకు అవసరమైన వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. అయినా పండుగ సందడి ఏ మాత్రం తగ్గలేదు. పలమనేరు పట్టణంలోని పలు వీధులు శుక్రవారం జనంతో నిండిపోయాయి. పండుగల కోసం బయటిప్రాంతాల్లో ఉన్నవారు సైతం స్వస్థలాలకు చేరుకున్నారు. నేడు ఉత్సాహంగా వినాయక చవితిని జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇక పూజాసామగ్రి ధరలతోపాటు చెండుమల్లి, సన్నమల్లి, కనకాంబరం, సంపంగి, రోజాపూలు, చామంతి, గుండుమల్లి ధరలకు రెక్కలొచ్చాయి. ఇక పండ్ల ధరలు అలాగే ఉన్నాయి. బొజ్జ గణపయ్యకు ప్రీతిపాత్రమైన అరటి గెలలు, వెలగపండ్లు, వెలగ పండ్లు, చెరకు గడలు ధరలు సైతం భారీగానే పెరిగాయి. ఈ దఫా మట్టి వినాయకుని విగ్రహాలను ఎక్కువమంది వినియోగించాలని స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించినా ప్రజలు పీవోపీ విగ్రహాలకే మొగ్గు చూపారు. ముఖ్యంగా యువత భారీ విగ్రహాల కొనుగోలుపై ఆసక్తి చూపారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను తక్కువ ధరకే అందించాయి. దాతలు ఉచితంగానూ అందజేశారు. పట్టణంలోని ప్రధానవీధులు, వ్యాపార కూడళ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. పట్టణంలో ట్రాఫిక్‌కు సైతం ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలమనేరు పోలీస్ డివిజన్ పరిధిలో అధికారికంగా 543 విగ్రహాలకు పోలీసులు అనుమతులిచ్చారు. ఇవిగాక అనధికారికంగా మరో 500 విగ్రహాలు దాకా నిర్వాహకులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అమాంతం పెరిగిన ధరలు

వినాయకుని పూజకు అవరసమైన పూజా సామగ్రి ధరలు పండుగ సందర్భంగా రెట్టింపు ధరలు పలికాయి. వెలగపండ్లు ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.30 వరకు పలుకుతున్నాయి. బంతిపూల ధరలు రూ.30 నుంచి రూ.50 దాకా ఉన్నాయి. మొన్నటిదాకా కిలో రూ.400గా ఉన్న మల్లెపూల ధరలు పండుగ సందర్భంగా కిలో రూ.700 పలికాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పూల ధరలు పెరగడంతో ప్రజలు బంతిపూల వైపే మొగ్గు చూపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యాపారులు సైతం ఇక్కడ పూలను విక్రయించారు.

పీవోపీ విగ్రహాలకే మొగ్గు

నియోజకవర్గంలో బయటి రాష్ట్రాలకు చెందిన పలువురు ఐదుచోట్ల పీవోపీ వినాయకుని విగ్రాహాలను తయారుచేసి అమ్మకాలు చేపట్టారు. ఒక్కో విగ్రహం సైజుని బట్టి రూ.5 వేల నుంచి లక్షకు పైగా పలికాయి. డివిజన్ పరిధిలో వెయ్యి విగ్రహాలకు రూ.కోటి దాకా ఖర్చు పెట్టినట్టు తెలుస్తోంది. దీంతోపాటు పండుగ ఖర్చులు, ఇతరత్రాల కోసం డివిజన్ పరిధిలో పండుగ వ్యాపారం రూ.5 కోట్ల దాకా జరిగినట్టు తెలుస్తోంది.







అమ్మకానికి ఉంచిన మట్టి విగ్రహాలు, విగ్రహాన్ని వాహనంలో తీసుకెళుతున్న గంగవరం మండల కొంగోళ్లపల్లి యువకులు, చెరకు గెడల అమ్మకం





పండుగ సామగ్రి కొనుగోలు





ఇతర రాష్ట్రాలవారు పలమనేరులో అమ్ముతున్న చేస్తున్న పీవోపీ వినాయకుని విగ్రహాలు

వర్షాధార పంటలు వేసుకోవాలి



రాగి పంటను సందర్శిస్తున్న అధికారులు

కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలో వర్షాధార పంటలు వేసుకోవడం చాలా మంచిదని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని, ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి అన్నారు. శుక్రవారం వీరు కుప్పం మండల పరిధిలోని ఉర్లవోబనపల్లి గ్రామంలో వరి, సామలు, చామంతి పూలతోటలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పంలో నీటి తీరువా తక్కువ అని, వర్షాధార పంటలు వేసుకోవడం మంచిదన్నారు. ప్రకృతి సేద్యం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించడం మంచిదని రైతులకు సూచించారు. ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించుకుని, వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నవరంగ్, ఆర్ఎస్‌కేలు మురుగానాయక్, శశికళ, రైతులు పాల్గొన్నారు.

ఫలించిన ఎస్టీయూ కృషి



సీఈవోతో సమావేశమైన ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలోని పీఎఫ్ సమస్యలపై ఎస్టీయూ చేసిన కృషి ఫలించిందని ఆ యూనియన్ నాయకులు తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతనెలలో ధర్నా చేస్తామని చెప్పగా సీఈవో, కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. టీచర్ల పీఎఫ్ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరు స్తున్నట్టు తెలిపారు. మదన్‌మోహన్‌రెడ్డి, పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, గుణశేఖర్, సు బ్రహ్మణ్యం, హరీష్, రంగనాథం, గణేష్ పాల్గొన్నారు.

అందరికీ నష్టపరిహారం అందేలా చూస్తాం



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

వి.కోట: పట్టణంలో నాలుగు రోజుల కిందట జరిగిన ఇరువర్గాల మధ్య ఘర్షణలో నష్టపోయిన దుకాణదారులకు, వాహనదారులకు, గాయపడిన వారికి నష్ట పరిహారం అందిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ట్రావెల్స్ బంగ్లాలో మండల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల పట్టణంలో జరిగిన ఘర్షణల్లో పలువురి వాహనాలు, దుకాణాలు దెబ్బతిన్నట్లు వివరించారు. ఇందుకు సంబంధించి నష్టపరిహారాన్ని అంచనాలు వేస్తున్నట్లు విరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మాహ్మద్ రఫీ, పోలీసులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి



కనమనపల్లెలో రాగి పంటనుపరిశీలిస్తున్న అధికారులు

గుడుపల్లె: ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు నాగపద్మిని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనమనపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వాతావరణ ఆధారిత పంటల సాగుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులు పంటలు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, భూసార పరీక్షలు వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం పంటలు సాగు చేయాలన్నారు. అడవి పందులు యాజమాన్యం, వివిధ పంటలలో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామంలో వేసిన రాగి పంటను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏవో నాగరాజు, రైతు సేవా కేంద్రం నవీద్ పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించాలని ర్యాలీ



మట్టి విగ్రహాలపై విద్యార్థుల ర్యాలీ

పెద్దపంజాణి: ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయక విగ్రహాలు కాకుండా మట్టితో చేసిన విగ్రహాలను పూజించాలని నాగిరెడ్డిపల్లి ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం బాబురెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి గ్రామంలో మట్టి గణపతికి జై కొట్టి పర్యావరణ పరిరక్షణకు సై అనాలని చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయిని మీనాక్షి మాట్లాడుతూ పీఓపీ విగ్రహాల వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూమి కలుషితమై ప్రకృతి విపత్తులకు దారి తీస్తుందని పేర్కొన్నారు. మట్టితో చేసిన విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అనంతరం పాఠశాలలో ముందస్తు వినాయక చవితి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేష్ బాబు, అంజప్ప, మాధవన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



టీఆర్.రాజేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన టీఆర్.రాజేష్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని గూడూరుపల్లి హైస్కూల్ హెచ్‌ఎం మహేష్ నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు సురేష్ రెడ్డి, భారతి, నరసింహులు, రఘు, చంద్రశేఖర్ రెడ్డి, భాగ్యలక్ష్మీ, జయ, శైలజరాణి, ప్రకాష్‌రావు, మునిరాజ, విజయవాణి, సలీం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

పలమనేరు: విజయవాడలో ఇబ్బందులు పడుతున్న వరద బాధితుల సాయం కోసం పట్టణానికి చెందిన పీపీఎస్ సభ్యులు రూ.1.16 లక్షలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ.44 వేలు, స్థానిక సాయి చైతన్య నిర్వాహకులు రూ.1.50 లక్షలను సాయంగా పంపినట్టు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

చెకుముకి సంబరాల్లో పాల్గొనాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గంగవరం: ఈ నెల 25న పాఠశాల స్థాయి నుండి ప్రారంభమయ్యే జనవిజ్ఞాన వేదిక చెకుముకి సంబరాల్లో విద్యార్థులు పాల్గొనాలని రాష్ట్ర జేవీవీ నాయకుడు యుగంధర్‌బాబు తెలిపారు. గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో జేవీవీ చెకుముకి పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజలు, విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంపొందించుకోవడానికి, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించడానికి ఏర్పడిందన్నారు. 25వ తేదీన పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, 27వ తేదీన జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు సాగుతాయన్నారు. ప్రతి విద్యార్థి చెకుముకి సంబరాల్లో పాల్గొనాలని కోరారు. ఎంఈవో -1, 2 వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, హెచ్‌ఎం రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి ప్రతిమలతో రాయలసీమ విద్యార్థులు



కల్లూరు హైస్కూల్‌లో మట్టి ప్రతిమల పంపిణీ

పుంగనూరు: పవిత్రమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పెట్టి పూజలు చేయాలని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మట్టిగణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మట్టిగణపతిని వినియోగించాలని సూచించారు. అలాగే పులిచెర్ల మండలం కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో కుమ్మరిసంఘం రాష్ట్ర శాలివాహన సంఘ కన్వీనర్ గురుస్వామి ఆధ్వర్యంలో 300 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



సమావేశంలో పూర్వ విద్యార్థులు

చౌడేపల్లె: మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో 2006-2007 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 18 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలనే వేదికగా ఏర్పాటు చేసుకుని శుక్రవారం కలిశారు. ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల అభివృద్ధితోపాటు, పేద విద్యార్థుల కోసం తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

వినాయక చవితికి ముమ్మరంగా ఏర్పాట్లు



వినాయక మండపం

వి.కోట: నేడు జరగనున్న వినాయచవితి ఉత్సవాలకు ఏర్పాట్లు మండలంలో అంబరాన్నంటుతున్నాయి. శుక్రవారం పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేస్తున్న ప్రతిమలకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా పట్టణంలో పూజాసామగ్రి, పండ్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

వరద బాధితులకు సాయం



విరాళాలు సేకరిస్తున్న నలంద విద్యార్థులు

వి.కోట: గత వారం రోజులుగా గుంటూరు, విజయవాడ పట్టణాల్లో వరద ముంపుతో బాధపడుతున్న వారికి తమ వంతు సాయం చేయడానికి ఎంతో మంది దాతలు ముందుకువచ్చి సాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని నలంద కళాశాల విద్యార్థులు మేము సైతం అంటూ ముందుకొచ్చి పట్టణంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ అంటూ బ్యానర్ ఏర్పాటు చేసుకుని పట్టణంలో ప్రదర్శనగా వెళ్లి దుకాణాలు, పట్టణ ప్రముఖుల వద్ద విరాళాలు సేకరించారు. ఈ విరాళాలను సీఎం సహాయనిధి ద్వారా వరద బాధితులకు పంపుతామని కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చవితి సందడి ప్రారంభం

- పందిళ్లు ఏర్పాటు
- జోరుగా వినాయక ప్రతిమలు, పత్రి వ్యాపారాలు



పత్రి, పూలు, పండ్లు కొనుగోలు చేస్తున్న జనం

పుంగనూరు: వినాయక చవితి పండుగను శనివారం వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. శుక్రవారం పట్టణంలోని తేరువీధి, బజారువీధి, కుమ్మరవీధి, కట్టకిందపాళెం, తూర్పుమొగశాల, ఎంబీటీ రోడ్డు, బస్టాండు, గోకుల్‌సర్కిల్, మేలుపట్ల, బాలాజీ థియేటర్, ఎన్ఎస్. పేట, భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా 155 చోట్ల వినాయకుడి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. పట్టణంలో పండుగ సంత వైభవంగా సాగింది. పూజకు అవసరమైన మట్టి వినాయకుడి ప్రతిమలు, అరటి, మామిడి, వెలగ, జామ, దానిమ్మ, జిల్లేడు, బిల్వపత్రి , గరిక పత్రాలు, చాటలు, పుటికలు విక్రయాలు జోరుగా సాగాయి. వినాయకుడికి ప్రీతికరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో పట్టణం కిక్కిరిసింది.



సదుం: వినాయక విగ్రహాల అమ్మకాలు

10 రోజులపాటు చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్, సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినాయక చవితి ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టారు. దీనిపై ముందుగా ఉత్సవ కమిటీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి అమలు చేయాలని ఆదేశించారు.

సదుంలో..

సదుం: వినాయక చవితి, సంత కావడంతో మండల కేంద్రంలో శుక్రవారం సందడి నెలకొంది. వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో పాటు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేవారితో బస్టాండు ప్రాంతం కిటకిలాడింది. సాయంత్రం విడతల వారీగా కురిసిన వర్షం కొనుగోలుదారులకు, వ్యాపారులకు ఇబ్బంది కలిగించింది. భారీ వినాయక విగ్రహాలను గ్రామాలలో ప్రతిష్టించేందుకు వాహనాలలో మేళతాళాలతో ఊరేగిస్తూ యువకులు సందడి చేశారు.







పుంగనూరులో వినాయకుడి బొమ్మలు, అరటి పిలకల విక్రయాలు